పది రోజులైనా వరద నీటిలోనే..



వరద నీటిలోనే న్యూఆర్‌ఆర్‌పేటకు వెళ్లే దారి



సింగ్‌నగర్‌లో ట్రాక్టర్లతో నిల్వ నీటిని తోడుతున్న దృశ్యం



ఇందిరానాయక్‌నగర్ వెనుక ఇంకా ముంపులోనే ఉన్న కరకట్ట

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): వరద ముంపు వచ్చి పది రోజులైనా ఇంకా బుడమేరు చుట్టుపక్కల ఉన్న పలు ప్రాంతాలు నీటిలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. న్యూరాజరాజేశ్వరిపేట, ఇందిరానాయక్‌నగర్, షణ్ముఖనగర్, సన్‌సిటీ కాలనీ, భరతమాత మందిరం కాలనీ, తోట వారి వీధి చివరి లైన్లు, వినాయక కాలనీ, అంబాపురం పంచాయతీ ఏరియా, పైపుల రోడ్డు పరిసర ప్రాంతాల్లో వరద నీరు ఇంకా రోడ్లపైన నిలిచిపోయింది. దీంతో స్థానికులు వరద నీటిలోనే అవస్థలు పడాల్సి వస్తోంది. ఇందిరా నాయక్ నగర్, అయ్యప్ప స్వామి టెంపుల్ రోడ్డు, బుడమేర కట్ట వెంబడి ప్రాంతాల్లో కార్పొరేషన్ అధికారులు మోటార్ల సాయంతో వరద నీటిని బుడమేరులోకి తోడిస్తున్నారు. గత పది రోజుల నుంచి తమకు కంటిమీద కునుకు ఉండటం లేదని, ఇళ్లలోని సామానులు అన్నీ వరద ముంపులో పాడయ్యాయని, వరద నీటిలో చిక్కుకున్న తమను కనీసం పలకరించే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వరద నీటిని తొలగించి, ఇళ్లను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారులోని కండ్రిక, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు బుడమేరు వరదలోనే ఉన్నాయి. ఆ రోడ్లల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం మెయిన్ రోడ్లపై వరద నీటిని బయటకు పంపడానికి చర్యలు చేపట్టింది. కానీ ఇళ్ల మధ్యలో ఉన్న బురద నీటిని మోటార్ల ద్వారా తోడించకపోవడంతో స్థానికులు అవస్థ పడుతున్నారు. మురుగునీరు కావడంతో ఆ నీటితో అనేక అంటువ్యాధులు వస్తాయని భయపడుతున్నారు.



అంబాపురంలో చుట్టూ నీరు

❖ పాయకాపురం, ప్రకాష్‌నగర్, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో మెయిన్ రోడ్డు పై వున్న వరద నీటిని జనరేటర్లతో మోటర్లు ఏర్పాటు చేసి మంగళవారం తోడేస్తున్నారు.

ముంపు బాధితులకు తప్పని తిప్పలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు తగ్గినా బాధితులకు తిప్పలు తప్పడం లేదు. కూరగాయలు తీసుకోవాలంటే క్యూ, రేషన్ తీసుకోవాలంటే క్యూ, ఎన్యూమరేషన్ కోసం వెయిటింగ్ చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30వ డివిజన్ దేవీనగర్ నగర్ వంతెన వద్ద కూరగాయలను రాయి తీపై విక్రయిస్తున్నారు. అయితే ఇక్కడ వరద ముంపు ప్రాంతాల వారికన్నా ముంపునకు గురికాని మధురానగర్, భానునగర్, పసుపుతోట ప్రాంత వాసులు క్యూ కడుతున్నారు. అలాగే రేషన్ కోసం కూడా క్యూలైన్‌లలో బారులు తీరుతున్నారు. వరద ముంపు నష్టం కోసం ఎనుమ్యరేషన్ బృందాలు సర్వే చేస్తున్నాయి. ఈ బృందాలు ఎప్పుడు తమ ఇళ్ళకు వస్తాయో తెలియక ఇళ్ళవద్ద పడిగాపులు కాస్తున్నారు.

డోర్ లాక్ అని పెడుతున్నారు..



ఉదయం వలంటీర్ వచ్చి ఎన్యూమరేషన్ బృందాలు వస్తున్నాయని ఇంటి వద్దే ఉండాలని చెప్పారు. దీంతో ఎక్కడికి వెళ్లకుండా నిరీక్షిస్తున్నాను. ఇంటి వద్ద లేకపోతే డోర్ లాక్ అని పెడుతారని చెబుతున్నారు. దీంతో వారు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తున్నాం.

–యండమూరి గాయత్రి, న్యూఆర్‌ఆర్‌పేట

ఇంటికొచ్చి ఇవ్వరంట..!



విజయవాడస్పోర్ట్స్: వరద బాధితులకు నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయడంలో అధికారులు, కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందంటూ పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఇళ్లు ఉన్న వారికి సైతం ఇంటి ముందుకొచ్చి ఇవ్వడం లేదంటూ నందమూరినగర్‌కు చెందిన లక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 200 మీటర్ల దూరంలో వాహనాన్ని నిలిపి అక్కడకు వచ్చి రేషన్ తీసుకోవాలని చెబుతున్నారని, వెళ్లని వారికి సరుకులు ఇవ్వడం లేదని ఆమె వాపోయారు.

చదువులు సాగేదెలా?



విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లింది. ఇళ్లలోకి చేరిన వరద నీరు పుస్తకాలను తడిపి ముద్ద చేసింది. లోతట్టు ప్రాంతాల్లో ఉండే పేదల ఇళ్లలోని చాలా వరకు పుస్తకాలు, బ్యాగులతో సహా వరదకు కొట్టుకుపోయాయని ఆయా ప్రాంతాల్లోని విద్యార్థులు చెబుతున్నారు. లెనిన్‌సెంటర్‌లోని అద్దె ఇంట్లో ఉండే లెంకా సబిత, కిరణ్‌కు ఐదుగురు పిల్లలు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కిరణ్ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రూ.లక్షకు పైగా ఖర్చు చేసి ఐదుగురు పిల్లలకు కొనుగోలు చేసిన పుస్తకాలు తడిసి ముద్దయ్యాయని కిరణ్ చెబుతున్నాడు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాస్త ఎండతగలడంతో సబిత పుస్తకాలను ఆరబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. పుస్తకాలు లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాల/ కళాశాలలకు వెళ్లలేకపోతున్నారు.

ఓ వైపు వరద.. మరోవైపు దొంగల బెడద



విజయవాడస్పోర్ట్స్: ఆసరాగా ఉంటున్న చిల్లర కొట్టులోని కొంత సరుకును వరద నాశనం చేస్తే.. మరి కొంత సరుకును దొంగలు ఎత్తుకుపోయారంటూ లెనిన్‌సెంటర్‌కు చెందిన షేక్ ఖాసీంబి వాపోతున్నారు. ఆమె భర్త సైతం ఏడు నెలల క్రితం మరణించడంతో ఆమె ఒంటరైంది. ఆమె రేకుల ఇంటి ముందే చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవనోపాధి సాగిస్తోంది. వరద వచ్చిన రోజు దుకాణం , ఇల్లు మునిగిపోవడంతో సమీపంలోని బంధువుల ఇంట్లో తలదాచుకున్నానని ఆమె చెబుతోంది. ఇప్పుడొచ్చి చూస్తే ఒక్క వస్తువు లేదని వాపోతోంది. వరద ఉధృతి ఉన్నపుడే కొందరు దొంగలు దుకాణం తలుపులు తెరిచి కొన్ని వస్తువులను ఎత్తుకుపోయారని, వారు తలుపులు వేయకుండా వెళ్లిపోవడంతో మిగిలిన వస్తువులన్నీ కొట్టుకుపోయానని చెబుతూ కంట నీరు పెట్టుకుంది.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే!

రామకృష్ణాపురం, దేవీనగర్ రోడ్డులో పది రోజులుగా నిలిచిన రాకపోకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ప్రభావంతో రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో పదిరోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వెళ్లాలన్నా.. దేవీనగర్ నుంచి రామకృష్ణాపురం రావాలన్నా చుట్టూతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామకృష్ణాపురం దేవీనగర్ మెయిన్ రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు ఆదివారం రోడ్డుపైకి చేరుకుంది. దీంతో అప్పటి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అయినా ఇంతవరకు కనీసం ఈ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించడానికి అవసరమైన కనీస చర్యలు తీసుకోలేదు. బుడమేరులో వరద ప్రవాహం తగ్గినా ఇక్కడ మోకాలికి పైగా లోతు ఉండటంతో ఇటువైపు వెళ్లాలంటేనే వాహనచోదకులు, పాదచారులు భయపడుతున్నారు.

రహదారికి కోత

వరద ప్రవాహానికి రోడ్డు సైతం కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. వరద నీరు నిలిచిపోవడంతో అంటు వ్యాధులు ప్రబలుతాయోమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, వాంబేకాలనీ తదితర ప్రాంతాలనే పట్టించుకుంటున్నారని రామకృష్ణాపురం, దేవీనగర్, దావు బుచ్చయ్యకాలనీ, జీవీఆర్‌నగర్‌లను పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ రాకపోకలు పునరుద్ధరించాలని కోరుతున్నారు.



రామకృష్ణాపురం, దేవీనగర్ రోడ్డులో బుడమేరు వరద నీరు

వరద బాధితులకు అపోలో వైద్యుడి సాయం

సాక్షి, అమరావతి: వరద బాధితులకు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ జె.జయ ప్రకాశ్ సాయి తన నెల వేతనంలో రూ.లక్ష సాయంగా అందించారు. ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేశారు. ఇటీవల వచ్చిన వరదలు ఏపీలో లెక్కలేనన్ని కుటుంబాలను అతలాకుతలం చేశాయని, ఎన్టీఆర్ జిల్లా ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.లక్ష విరాళం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.లక్ష్మి నారాయణ, పి.వెంకట్ తెలిపారు.

వరద బాధితులకు అండగా..



అంబాపురంలో ఆహార పొట్లాలు అందజేస్తున్న గౌతంరెడ్డి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు బాధితులకు అండగా ఉంటామని ఆందోళన చెందవద్దని ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డి అన్నారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యాన మంగళవారం అంబాపురం వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా మందిరం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవల్లో ఎప్పుడూ ముందుంటుందన్నారు. వరద ముంపు బాధితులకు తొలిరోజు నుంచి ఇప్పటి వరకు తాము ఆహారం తాగునీరు, అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మందిరం కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ బుడమేరు వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులకు మంగళవారం తూర్పుగోదావరి, ఎన్టీఆర్, విజయవాడ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ నిత్యావసర సరుకులు , పాలు, పండ్లు పంపిణీ చేశారు. రామకృష్ణాపురం, బుడమేరు మధ్యకట్ట, ముత్యాలంపాడు పునరావాస కేంద్రంలో సుమారు 1500 మందికి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాయుడు, శివ నాయుడు, ఎస్ గణేష్, నగర అధ్యక్షుడు కావూరి కృష్ణ, గరిమెళ్ళ చిన్నా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

■ వినాయకనగర్‌లో వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచనల మేరకు దావు బుచ్చయ్యకాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియోషన్ అధ్యక్షుడు చింతపల్లి కనకారావు పాలు, ఆహార పొట్లాలు అందజేశారు.

అరకొరగా వైద్యసేవలు!



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒకవైపు బుడమేరు వరదతో అవస్థ పడుతున్న ప్రజలకు వైద్య సిబ్బంది అరకొర సేవలను మాత్రమే అందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. వరద ప్రభావంతో జలుబు, దగ్గు, జ్వరాలతో అల్లాడుతున్నారు. జీవీఆర్‌నగర్ పందిరి రోడ్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్ద దగ్గు ఉందని చెబితే ఐదు ఎమాక్సిలిన్ ట్యాబెట్‌లు చేతిలో పెట్టి పంపిస్తున్నారు. యాంటిబయాటిక్‌ను ఐదు రోజుల కోర్సు వాడాలని లేకపోతే డ్రగ్ రెసిస్టెన్స్ పెరిగిపోతుంది కదా అని ప్రశ్నిస్తే అందరికీ ఇవ్వాలంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగ్గక పోతే మళ్లీ తమ వద్దకు రావాలని లేని పక్షంలో ఆరోగ్యకేంద్రానికి వెళ్లాలని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. కనీసం దగ్గుకు అవసరమైన సిరప్ కూడా లేదని చెబుతున్నారు. అటువంటప్పుడు ఇక్కడ వైద్యశిబిరాలు ఎందుకు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

తక్షణమే పరిహారం అందించండి

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



ఊర్మిళానగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు తక్షణమే పరిహారం అందించాలని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుడమేరు వరద ముంపునకు గురైన ఊర్మిళానగర్‌లో మంగళవారం మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పర్యటించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరినీ పలకరిస్తూ జరిగిన నష్టం వివరాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరద ప్రభావంతో ఊర్మిళానగర్ వాసులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఒక్కో ఇంట్లో లక్షల రూపాయల నష్టం సంభవించిందని తెలిపారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, పుస్తకాలు పూర్తిగా వరద నీటికి తడిసిపోయాయని, ప్రభుత్వం వాటిపై కూడా దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులకు పుస్తకాలు, సర్టిఫికెట్లు జారీ చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిత్యావసర సరుకుల కోసం ప్రజలు రోడ్ల మీద పడిగాపులు కాస్తున్నారన్నారు. వారికి నిత్యావసరాలను ఇంటి వద్ద అందించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో శానిటేషన్ చేయడంలో అధికార యంత్రాంగం, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరద నీరు ఇప్పటికీ రోడ్ల మీద, ఇళ్లలోనూ నిలిచిపోయాయని తక్షణమే మోటార్లు ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతంలో నిలిచిన వరద నీటిని తొలగించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు విషజ్వరాలు, అంటురోగాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యాన చంద్రను కోరారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. వరద ముంపు ప్రాంతాల్లో సత్వరమే నష్టం అంచనాలు రూపొందించి బాధితులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వెలంపల్లి శ్రీనివాసరావు వెంట కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కుటుంబ సమేతంగా అలరిస్తున్న ఉరుకు పటేల

చిత్ర హీరో తేజస్ కంచర్ల



ఉరుకు పటేలవిజయోత్సవ యాత్రలో నగరానికి వచ్చిన హీరో తేజస్, హీరోయిన్ కుష్బూ చౌదరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 7న విడుదలైన ఉరుకు పటేల చిత్రం లవ్, కామెడీ, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను అలరిస్తోందని ఆ సినిమా హీరో తేజస్ కంచర్ల అన్నారు. విజయోత్సవ యాత్రలో భాగంగా ఆ చిత్రం యూనిట్ సభ్యులు మంగళవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో తేజస్ కంచర్ల మాట్లాడుతూ కుటుంబ సమేతంగా చూడదగిన సినిమా అని, యూత్‌కు నచ్చే అంశాలు తమ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయన్నారు. దర్శకుడు వివేక్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఉరుకు పటేల సినిమాను తీసినట్లు తెలిపారు. అనంతరం హీరోయిన్ కుష్బూ చౌదరి మాట్లాడుతూ తన మొదటి చిత్రం ఉరుకు పటేలా విజయవంతం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ ప్రేక్షకులకు బాగా నచ్చుతుందని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ యాసలో మాట్లాడే డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో నష్టం అంచనాపై సర్వే



కండ్రికలో ఎన్యూమరేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాయకాపురం(విజయవాడరూరల్): బుడమేరు ముంపు ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది మంగళవారం నష్టం అంచనాలపై సర్వే చేశారు. రాజీవ్‌నగర్, ఉడా కాలనీ, వడ్డెర కాలనీ, కండ్రిక, నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌నగర్, ప్రజాశక్తినగర్, రాధానగర్, తదితర ప్రాంతాల్లో పది రోజులుగా బుడమేరు వరద ఇప్పటికీ ఇళ్లలో ఉంది. ఈ పరిస్థితుల్లో ఎన్యూమరేషన్ సిబ్బంది వచ్చే సమయంలో బాధితులు తమ ఇళ్ల వద్ద ఉండి సిబ్బంది అడిగిన సమాచారం తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం బాధితులు ముంపునకు గురైన ఇళ్ల వద్ద ఉండి సర్వే చేస్తున్న సిబ్బందికి వివరాలు తెలపాలని ఆదేశించడంతో బయట ప్రాంతాల్లో తలదాచుకుంటున్న వారు ఉదయం నుంచి ఇళ్ల వద్దే ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు లాగిన్ ఐడీ ఇవ్వలేదు. దీంతో సిబ్బంది సర్వేకు రాకపోవడంతో బాధితులు కొందరు ఇంటి వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. గురువారంలోగా ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో యాప్ పని చేయడంలేదని సిబ్బంది టెన్షన్ పడుతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన కుటుంబాలకు నష్ట పరిహారం ఎంత ఇస్తారనే విషయాన్ని బాధితులు అడుగుతున్నారు. వరద ప్రాంతాల్లో సచివాలయం అడ్మిన్‌తో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సిబ్బంది ఎన్యూరేషన్ చేస్తున్నారు.

ఘనంగా విశ్వనాథ జయంతి



ఎస్ఆర్ఆర్ కళాశాలలో ..

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కొనియాడారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె విశ్వనాథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, కేవీ శాంతకుమారి, ఎన్.శ్రీకాంత్ మాట్లాడారు.

గురుకుల కళాశాలలో...

ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో మంగళవారం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, అరుణ,ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నవ హారతులిచ్చే దుర్గాఘాట్ పరిశీలన



దుర్గాఘాట్‌లో పంచహారతుల వేదికను పరిశీలిస్తున్న ఈవో రామరావు, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పవిత్ర కృష్ణమ్మకు నవ హారతులిచ్చే దుర్గాఘాట్‌ను దుర్గగుడి ఈవో, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు మంగళవారం పరిశీలించారు. కృష్ణానదికి భారీ వరద నేపథ్యంలో దుర్గాఘాట్‌లో హారతుల వేదిక ముంపునకు గురైంది. నదికి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం సాయంత్రం ఆలయ అధికారులు ఘాట్‌ను పరిశీలించారు. త్వరలో కృష్ణానదికి హారతులు తిరిగి ప్రారంభించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో రామరావు ఇంజినీరింగ్ అధికారులను, ఆలయ వైదిక కమిటీకి సూచించారు. డీఈవో లీలా కుమార్, ఈఈ లింగం రమా, ఏఈవో ఎన్. రమేష్‌బాబు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'స్ఫూర్తి సభ'లను ప్రభుత్వం నిర్వహించాలి

విజయవాడ కల్చరల్: తెలుగు సినీ దిగ్గజాల స్ఫూర్తి సభలను భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రభుత్వం నిర్వహించాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కళాపీఠం ఆధ్వర్యాన సంస్థ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమ ఉన్నతికి ఎందరో కృషి చేశారని వారిలో అక్కినేని, నందమూరి, కృష్ణ, శోభన్ బాబు, మహానటి సావిత్రి, భానుమతి, కన్నాంబ, జమున, అంజలీదేవి, సూర్యాకాంతం లాంటి ఎందరో కనిపిస్తారని పేర్కొన్నారు. వారి శత జయంతులు, వర్ధంతులను ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ద్వారా నిర్వహించాలని వాటిని విజయవంతం చేయడానికి కళా సంస్థలు కృషి చేస్తాయని తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్, సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులు సయ్యద్ ఆలీ, శ్యాం ప్రసాద్, చలపతిరావు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయకనగర్‌లో మంగళవారం వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు.

–దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు, దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదో రోడ్డు, లచన్ ఇన్‌ఫ్రా లో వినాయక చవితి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.

దుర్గమ్మ సన్నిధిలో ఆధ్యాత్మిక ప్రవచనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ పురాణ పండిట్ వెంకటేశ్వరశాస్త్రి ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ప్రాశస్త్యం, ఆలయ విశేషాలపై చక్కటి వ్యాఖ్యానంతో భక్తులకు వివరించారు. అమ్మవారిని దర్శించుకుని కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు ఆధ్యాత్మిక ప్రవచనాన్ని విని తన్మయత్వం చెందారు. అనంతరం వెంకటేశ్వరశాస్త్రిని ఆలయ అధికారులు సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

గ్యాస్ స్టౌలకు ఉచితంగా మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు బాధితులకు హెచ్‌పీ మారుతీగ్యాస్ కంపెనీ ఆధ్వర్యాన గ్యాస్ స్టౌలకు ఉచితంగా మరమ్మతులు చేస్తున్నామని మారుతీగ్యాస్ కంపెనీ అధినేత చెట్లపల్లి మారుతీ ప్రసన్న తెలిపారు. స్థానిక ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలో మంగళవారం మారుతీ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యాన ఉచిత సర్వీసింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ తాము ఉచితంగా సర్వీసింగ్‌తో పాటు అవసరమైన విడి భాగాలను కూడా వేస్తున్నామని ఆయన తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరా పునరుద్ధరణ

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ద్వారా సరఫరా అవుతున్న 77, 540 కుళాయి నీటి కనెక్షన్లను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ జరిగిన నీటి కనెక్షన్ల నుంచి వచ్చే నీటిని కేవలం వాడుకునేందుకు మాత్రమే వినియోగించాలని, తాగడానికి కుళాయి ద్వారా వచ్చే నీటిని వినియోగించొద్దని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగడానికి 229 ట్యాంకర్లతో రోజూ 25 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కేవలం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న సురక్షిత తాగునీటిని మాత్రమే వినియోగించాలని, ఈ సమాచారాన్ని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నామని వివరించారు. సర్కిల్-1 పరిధిలోని కేఎల్ రావు నగర్, ఊర్మిళానగర్, నైజాంగేట్, కబేళా, ఐరన్ యార్డ్, హెచ్‌బీ కాలనీ, సర్కిల్ 2 పరిధిలో ఉన్న సింగ్‌నగర్, వాంబే కాలనీ, నందమూరి నగర్, శాంతినగర్, పాత రాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేటలోని ప్రజలు ఈ నీళ్లను వాడుకోవాలని తెలిపారు.